

## దరఖాస్తుల ఆహ్వానం

**హిందూపురం, ఆగస్టు 6:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ (ఐటీఐ) కళాశాలల్లో మిగిలిన సీట్లకు మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాయపురెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 27లోపు కళాశాలకు నేరుగా వెళ్లి, ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 29న ప్రభుత్వ, 31న ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. వివరాలకు 9440285629 నెంబరులో సంప్రదించాలని ఆయన వివరించారు.






# మోగనున్న పెళ్లి బాజా..!

## నేటి నుంచి వివాహ సందడి

### 90రోజుల తరువాత శుభముహూర్తాలు
### ఇప్పటికే బుకింగ్ అయిన కల్యాణమండపాలు
### పుంజుకోనున్న వ్యాపారాలు

శ్రావణమాసం వచ్చేసింది. పూజలు ప్రారంభమయ్యాయి. ఇక పెళ్లి బాజాలు కూడా మోగనున్నాయి. మూడునెలల తరువాత పెళ్లిసందడి మొదలుకానుంది. వివాహాలతోపాటు గృహప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభకార్యాలకు దివ్యమైన ముహూర్తాలు ఉండడంతో ఎటుచూసినా హడావుడి మొదలైంది. దీంతో 90 రోజులు మూఢం కారణంగా శుభకార్యక్రమాలకు బ్రేక్ పడింది. దీంతో కల్యాణమండపాలు మూతపడ్డాయి. పురోహితులు, క్యాటరింగ్, పూల డెకరేషన్ వంటి వ్యాపారులకు ఉపాధి కరువైంది. బంగారు క్రయవిక్రయాలు తగ్గాయి. శ్రావణ మాసం రావడం, శుభ ముహూర్తాలు ఉండడంతో అందరూ బిజీ కానున్నారు. బుధవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు దాదాపు 14 మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఈ శుభ గడియల్లో జిల్లావ్యాప్తంగా ఇప్పటికే వేల జంటలు వివాహంతో ఒక్కటవనున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపాలను బుకింగ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. కల్యాణ మండపాలు దొరక్క చాలామంది తిరుపతి, కాణిపాకం, గ్రామాల్లోని చిన్నచిన్న ఫంక్షన్ హాళ్లతోపాటు ఆలయాలు కూడా పెళ్లిళ్లతో కిటకిటలాడనున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ముందస్తుగానే కల్యాణ మండపాలు, ఆలయాలు అడ్వాన్స్‌గా లాడ్జిలు సైతం బుకింగ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా జిల్లాలోని దేవాలయాలు, లాడ్జీలు, కల్యాణమండపాలకు డిమాండ్ పెరిగింది. క్యాటరింగ్, పూల డెకరేషన్, పండితులు, వంట మనుషులు, ఫొటోగ్రాఫర్లు, లైటింగ్, సౌండ్ సిస్టం, బాజాభజంత్రులు వాయించే వారు ముందస్తుగా బుకింగ్ అయిపోయాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. చాలామంది ఈ నెలలో గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు చేసుకోనున్నారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు తదితర శుభకార్యక్రమాలపై ఆధారపడి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిలో శ్రావణ మాసం రావడంతో ఆశలు చిగురించాయి. వ్యాపారాలు పుంజుకుంటాయని ఆశాభావంతో ఉన్నారు. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ప్రైవేటు వాహనాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. అడ్వాన్సులు చెల్లించి మరీ.. బుక్ చేసుకున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

\- ధర్మవరం


ముస్తాబైన కల్యాణమండపం

### ఖర్చుకు తగ్గేదేలే..

జిల్లాలో కొన్నేళ్లుగా పెళ్లిళ్ల ట్రెండ్ మారిపోయింది. చిన్న పెళ్లి చేయాలన్నా రూ.10లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. డబ్బున్న వారు ఖర్చుకు వెనకాడట్లేదు. మధ్యతరగతి వారు కూడా స్థోమతకు తగ్గట్టుగా పెళ్లిళ్లు చేస్తున్నారు. దీంతో ఊరేగింపు, మెహందీ, వీడియో, లైటింగ్, భోజనాలు, బంగారం, దుస్తుల కొనుగోలుకు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. కొన్ని పెళ్లిళ్లలకు రూ.కోట్లలో సైతం వెచ్చిస్తున్నారు. పెళ్లి విందు భోజనంలో 20 నుంచి 30 రకాల వంటకాలు చేయించడానికి కూడా రాజీపడట్లేదు.



### ఇవీ.. శుభ ముహూర్తాలు

ఈనెల 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24 తేదీల్లో శుభ ముహూర్తాలున్నాయి. ఆయా రోజుల్లో పిల్లలకు పెళ్లిళ్లు చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఈ నెలలో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయని పురోహితులు పేర్కొంటున్నారు.

### • శ్రావణం.. శుభకార్యాల మాసం



శ్రావణం అంటేనే శుభకార్యాల మాసం. మంచి ముహూర్తాలు ఉంటాయి కనుక శుభకార్యాలు పెద్దఎత్తున జరుగుతాయి. శ్రావణ మాసంలో వివాహం చేసుకుంటే అంతా శుభం చేకూరుతుందని ప్రజల నమ్మకం. దీంతో పురోహితులు బిజీగా ఉంటారు.

\- భానుప్రకాశ్, అర్చకుడు


సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

## మున్సిపాలిటీలో
# ముసలం..!


పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం

### పుట్టపర్తి కమిషనర్‌పై అసమ్మతి
### మూకుమ్మడి సెలవులో ఉద్యోగులు


**పుట్టపర్తి, ఆగస్టు 6:** జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ముసలం పుట్టింది. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఉద్యోగుల మధ్య వివాదం తలెత్తింది. కమిషనర్‌పై అసమ్మతి వెల్లగక్కుతున్నారు. ఉద్యోగులు మంగళవారం మూకుమ్మడి సెలవు పెట్టారు. సెలవుకు కమిషనర్ అనుమతి ఇవ్వకపోగా.. విధులకు గైర్హాజరైనట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కమిషనర్ తీరు సరిగా లేదనీ, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఉద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు. కమిషనర్‌కు ప్రయోజనం చేకూర్చే బిల్లులను రూల్స్‌కు విరుద్ధంగా చేయాలంటూ ఒత్తిళ్లు తేవడం, జీతాలు సకాలంలో చెల్లించట్లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. ఉద్యోగులు సకాలంలో కార్యాలయానికి రాకపోవడం, వచ్చినా విధులు సరిగా నిర్వర్తించకపోవడం పట్ల ప్రశ్నించడంతోనే కమిషనర్‌పై తిరుగుబాటు చేశారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. పరస్పర ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో పరపాలన అస్తవ్యస్తంగా మారినట్లు తెలుస్తోంది. కార్యాలయంలో ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా పనిచేయనందుకు వేధింపులు

నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చేయనందుకు కమిషనర్ ఇబ్బంది పెడుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో వారు మంగళవారం సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. కమిషనర్‌కు సీసీఏ నిబంధనలు ఏమాత్రం తెలియవని వాపోతున్నారు. ఇంక్రిమెంట్లు ఇవ్వరనీ, జీతాలు సకాలంలో చెల్లించడంలేదని మండిపడుతున్నారు. సిబ్బంది బిల్లులు మంజూరు చేయాలంటే అందుకు ప్రతిఫలం ఇవ్వాల్సి వస్తోందన్నారు. సమావేశంలో మేనేజర్ లక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, ఆర్ఐ హరి, ఏఈ స్వాతి, టీపీఓ నరసింహులు, సచివాలయ ఉద్యోగ సంఘం నాయకుడు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. వీరికి మద్దతుగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులను వేధించే కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జిల్లాలో 5242.99 ఎకరాల రిజిస్ట్రేషన్

### ప్రభుత్వానికి నివేదిక
### ఈ లెక్కలోనూ తేడాలు?
### దాచిపెట్టారా అన్న అనుమానాలు



# ఫ్రీహోల్డ్ లెక్కతేలింది!

**పుట్టపర్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల లెక్కతేల్చారు. గత వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ తీసుకొచ్చిన ఫ్రీహోల్డ్ అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు, బడా వ్యాపారులు అనుకూలంగా మలచుకున్నారు. ముందస్తు పక్కాప్రణాళికతో పేదలు, మధ్యతరగతి వర్గాల అసైన్డ్ భూములను కారుచౌకగా కొట్టేసిన సంగతి తెలిసింది. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్ జీవో జారీ చేయడమే తరువాయి.. రెవెన్యూ అధికారులపై వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఒత్తిళ్లు చేసి రూ.కోట్లు విలువ చేసే అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పేదలకు బతుకుదెరువు కోసం ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను కొట్టేసేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడ్డారన్నది బహిరంగ రహస్యమే. ఫ్రీహోల్డ్ మాటున రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి వేల కోట్ల రూపాయల విలువైన భూములను సొంతం చేసుకున్నట్లు కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈనేపథ్యంలో నిషేధిత 22(ఏ) భూములతోపాటు 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములకు హడావుడిగా ఫ్రీ హోల్డ్ (యాజమాన్య హక్కులు) కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేసి, వేల కోట్ల రూపాయల విలువైన అసైన్డ్ భూములు కొట్టేయడంపై కూటమి ప్రభుత్వం పునఃసమీక్షకు సిద్ధమైంది. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, జీవో 596 అమలు తాత్కాలికంగా నిలుపుదల చేసింది. జిల్లా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వారీగా ఫ్రీహోల్డ్, 22(ఏ) కింద రిజిస్ట్రేషన్‌తోపాటు అన్యాక్రాంతమైన భూములపై లెక్కలు తీశారు. జిల్లాలో 1,92,329 ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పించారు. వీటిలో ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఎన్ని ఎకరాలు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు సాగాయో తాజాగా వివరాలు సేకరించారు. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మౌఖిక ఆదేశాలతో జిల్లాలో దీనిపై చర్చ నడుస్తోంది.


### ఫ్రీహోల్డ్ లెక్కతేలింది..

జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నిషిద్ధ జాబితా భూముల 22(ఏ)తోపాటు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల 5242.99 ఎకరాలు జరిగినట్లు లెక్కతేల్చారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక నివేదికను జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ.. ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబరు నుంచి ఈఏడాది జూలై21 దాకా 22(ఏ)తోపాటు ఫ్రీహోల్డ్ మాటున అసైన్డ్ భూములు చేతులు మారాయి. ఇందులో పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ అసైన్డ్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో 7800 ఎకరాలకుపైగా ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జూలైలో నివేదిక ఇచ్చారు. తద్వారా జిల్లా.. రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. తాజాగా జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇచ్చిన నివేదికలో వ్యత్యాసం కనిపిస్తోంది. దీనిని బట్టి చూస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కొన్నిచోట్ల వాస్తవాలు దాచిపెట్టి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. సబ్ రిజిస్ట్రార్లు ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం లోతుగా పరిశీలన చేయనున్నట్లు తెలుస్తోంది. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేసిన భూముల్లో అత్యధికంగా వైసీపీ నేతలు, బడా రియల్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయని తెలుస్తోంది. కొందరు బినామీల పేరుతో ముందస్తు అగ్రిమెంట్లు, కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

## వైసీపీ నేతన్నలు..!

### గత ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు
### వైసీపీ నాయకులకు ప్రయోజనం
### మగ్గం లేకున్నా.. చేనేత పింఛన్



బోగస్ పింఛన్‌కార్డులు

**ధర్మవరం, ఆగస్టు 6:** గత వైసీపీ పాలనలో అనర్హులకు పింఛన్లను పంచిపెట్టారు. వైసీపీ నాయకులకు అప్పనంగా ఇచ్చారు. మగ్గం నేయడం రాకున్నా.. నేతన్న కాకున్నా.. చేనేత పింఛన్ ఇచ్చారు. ధర్మవరంలో చేనేత పింఛన్లను పెద్దఎత్తున అనర్హులకు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మగ్గం ఉన్న చేనేత కార్మికుడిని కాదని వైసీపీ నాయకులు.. అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ అనుచరులకు పింఛన్లు మంజూరు చేయించినట్లు తెలుస్తోంది. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పింఛన్ల అక్రమాలపై చర్యలు తప్పవన్న చర్చ సాగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అన్ని రకాల పింఛన్లపై సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని 34వవార్డులో కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది కుమ్మక్కై 20 బోగస్ చేనేత పింఛన్లు చేసినట్లు తెలుస్తోంది. 20 దాకా బోగస్ దివ్యాంగ పింఛన్లు సైతం ఉన్నట్లు సమాచారం. బి.లక్ష్మీదేవి (ఐడీ నంబరు 112985535) చేనేత, తాటిచెర్ల నారాయణమ్మ (ఐడీ నంబరు 12500030112), తాటిచెర్ల కుళ్లాయప్ప (ఐడీ నంబరు 112853333) దివ్యాంగ పింఛన్ పొందుతున్నారు. ఇవి ఒకే ఇంటిలోనే ఉండటం గమనార్హం. 25వ వార్డులో 25 దాకా బోగస్ పింఛన్లు ఉన్నట్లు సమాచారం. దీనిపై అధికారులు విచారించి, అనర్హుల పింఛన్లను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### విచారించి.. చర్యలు చేపడతాం..

బోగస్ పింఛన్ల విషయం నా దృష్టికి రాలేదు. విచారించి, చర్యలు తీసుకుంటాం.

\-రాంకుమార్, మున్సిపల్ కమిషనర్

# భూసమస్యలకు చెక్ పెట్టండి

### శాంతిభద్రతలను పరిరక్షించండి
### యువతకు ఉపాధి కల్పించండి
### కలెక్టర్, ఎస్పీకి ముఖ్యమంత్రి దిశానిర్దేశం


సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రితో సమావేశమైన జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జిల్లా ఎస్పీ రత్న


**పుట్టపర్తి/పుట్టపర్తిరూరల్, ఆగస్టు 6:** ప్రతిసమస్యకు మూలం భూవివాదంతో ముడిపడిఉంటుందనీ, నిష్పాక్షికంగా సమస్యలను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్నకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రితో కలెక్టర్, ఎస్పీ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి.. జిల్లా అభివృద్ధి, సంక్షేమం, సమస్యలు, శాంతిభద్రతలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వంలో భూసమస్యలు, భూకబ్జాలు పెరిగిపోయాయనీ, వాటికి అంతం పలికే దిశగా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. భూకబ్జాలు, భూసమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారితో మమేకమై, సమస్యలను పరిష్కరించినపుడు వారి ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. ఆ దిశగా పనిచేయాలన్నారు. వ్యవసాయం, పండ్లతోటల పెంపకం, పాడిపరిశ్రమ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించి, యువతకు ఉపాధి చూపాలని సీఎం సూచించారు ఇందుకుప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకుని, ముందుకెళ్లాలని సూచించారు. తద్వారా యువత అసంతృప్తి నుంచి బయటపడి, అక్రమమార్గాలు, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడకుండా అరికట్టవచ్చన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా పనిచేయాలనీ, బాధితుల పట్ల దయతో వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఆయన పలు సూచనలిచ్చారు.

### వైభవం.. ఖాద్రీశుడి
# వెండి ప్రాకారోత్సవం

కదిరి పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుల స్వామివారి వెండిరథ ప్రాకారోత్సవం వైభవంగా సాగింది. వెండిరథంపై కొలువుదీరిన స్వామివారిని సుగంధ పుష్పాలు, కదిరి మల్లెలు, తులసీ మాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

\-కదిరి


వెండిరథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు



# లక్ష్మీ కటాక్షం ఏదీ ?



అనంతపురం మొదటి రోడ్డులోని శివాలయం

- డీడీఎన్ఎస్ లేదు..వేతనాలూ అందడం లేదు..
- డెత్ గ్రాట్యుటీ ఫైళ్లను కదిలించని అధికారులు
- దేవదాయశాఖపై పూజారుల ఆగ్రహం
- కూటమి ప్రభుత్వంలోనైనా తీరు మారేనా..?

**అర్చకులకు ఆర్థిక కష్టాలు**

నిత్యం దైవారాధన చేసే అర్చకులు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని దేవదాయ శాఖ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు అర్చకులకు డీడీఎన్ఎస్ (ధూపదీప నైవేద్యం), ధార్మిక పరిషత్ వేతనాలు అందడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,115 ఆలయాలు దేవదాయశాఖ పరిధిలో ఉన్నాయి. వీటిలో 6ఏ గ్రూప్ కింద కసాపురం, గవిమఠం, గూగూడు, పెద్దపప్పూరు, పంపనూరు, నేమకల్లు, మురిడి, పెన్నహోబిలం, ఆలూరుకోన, తొండపాడు, భక్తరహళ్ల, కదిరి ఆలయాలు ఉన్నాయి. వీటి వార్షిక ఆదాయం రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉంటుంది.

- అనంతపురం కల్చరల్

### భారీగా ఆదాయం

- కసాపురం, కదిరి ఆలయాల వార్షికాదాయం రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది. అందుకే ఈ ఆలయాలకు డిప్యూటీ కమిషనర్ హోదా అధికారి ఈఓగా ఉంటారు. రూ.5కోట్లకు పైగా వార్షికాదాయం ఉన్న గవిమఠం ఆలయానికి సహాయ కమిషనర్ హోదా అధికారి ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తుంటారు.
- రూ.5లక్షల నుంచి రూ.25లక్షలలోపు వార్షికాదాయం కలిగిన ఆలయాలను 6బీ గ్రూపుకింద, రూ.50వేల నుంచి రూ.5లక్షలలోపు ఆదాయమున్న ఆలయాలను 6సీ గ్రూపుకింద పరిగణిస్తారు. రూ.50వేలలోపు వార్షికాదాయమున్న ఆలయాలకు

గతంలో టీడీపీ ప్రభుత్వం డీడీఎన్ఎస్ పథకాన్ని, అర్హత కలిగిన అర్చకులకు ధార్మిక పరిషత్ కింద వేతనాలను ప్రవేశపెట్టింది. డీడీఎన్ఎస్ కింద రూ.5వేలు, ధార్మిక పరిషత్ కింద అర్చకులకు వేతనంగా రూ.15,625 అందజేసేవారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా 2,500 మంది అర్చకులు డీడీఎన్ఎస్, ధార్మిక పరిషత్ వేతనాలు పొందేవారు. గత వైసీపీ ప్రభుత్వం డీడీఎన్ఎస్‌ను రూ.10వేలకు పెంచుతామన్న హామీ ఇచ్చినా అమలు చేయలేదు.

### మంచి రోజులు వచ్చేనా..?

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా డీడీఎన్ఎస్ అర్చకుల సంఖ్య 8 వేలకు పైగా ఉంది. వీరిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 677 మంది డీడీఎన్ఎస్, ధార్మిక పరిషత్ కింద 183 మంది వేతనాలు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో డీడీఎన్ఎస్‌ను రూ.10వేలకు పెంచుతూ దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటికే సంతకం చేశారు. దీంతో అర్చకుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. డీడీఎన్ఎస్ అర్చకులకు తరచూ బ్యాంకు ఖాతాల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సమస్యలు తలెత్తుతుండడంతో ఖాతాల్లో సొమ్ము జత కావడం లేదు. దానిని పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### అందని డెత్ గ్రాట్యుటీ

ఉరవకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి దేవాలయ అర్చకుడు అనంతయ్య 2023 జనవరి 24న మృతి చెందారు. ఆయన తదనంతరం కుమారుడికి డీడీఎన్ఎస్ వర్తింపజేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నర కావస్తున్నా ఇంత వరకూ అధికారులు చర్యలు చేపట్టలేదు. కుందుర్పిలోని శివాలయ పూజారి పంచాంగం రాంబాబు 2023 ఆగస్టు 15న మృతి చెందితే ఆయన డెత్ గ్రాట్యుటీని కుటుంబ సభ్యులకు ఇప్పటికీ అందించలేదు. జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో ఈ ఫైల్‌కు మోక్షం లభించకపోవడం దారుణం. ఇలా దాదాపు 30 మంది అర్చకులకు సంబంధించిన ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే దేవదాయ శాఖ నిర్లక్ష్య వైఖరి అర్థమవుతోంది.

**అలసత్వం తగదు...**



దేవదాయశాఖ అధికారుల అలసత్వం వల్ల అర్చకులు నష్టపోవాల్సి వస్తోంది. డీడీఎన్ఎస్, ధార్మిక పరిషత్ వేతనాల బకాయిలు, డెత్ గ్రాట్యుటీ పెండింగ్ వంటి వాటికి సంబంధించిన ఫైళ్లను అధికారులు పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నారు. సమస్యలు తెలిపేందుకు సహాయ కమిషనర్ కార్యాలయానికి వెళ్తే కనీసం లోపలికి కూడా అనుమతించకపోవడం దారుణం.

- ఆంజనేయులు, ఏపీ అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

**స్పందన లేదు..**



నా భర్త అనంతయ్య మృతి చెంది ఏడాదిన్నర అవుతోంది. ఆయన తదనంతరం అర్చకుడిగా కొనసాగుతున్న నా కుమారుడు పవన్‌కుమార్‌కు డీడీఎన్ఎస్ వర్తింపజేయాలని దేవదాయశాఖ అధికారులను కోరాం. అయినా స్పందన కరువయ్యింది.

- హేమావతి, రాంపురం

## యథాప్రకారం నడవనున్న రైళ్లు



**గుంతకల్లు, ఆగస్టు 6:** జిల్లాలోని పెనుకొండ-మక్కాజిపల్లి సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంతకల్లు-హిందూపురం (నెం. 07693) రైలును ఈ నెల 8, 10 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు డెము రైలు (నెం. 07694)ను 9, 11 తేదీల్లో పాక్షికంగా రద్దుచేయడానికి నిర్ణయించామని, కానీ ఆ రైళ్లను ఆ తేదీల్లో యథా ప్రకారంగా నడుపుతామని తెలిపారు. అలాగే కాచిగూడ-యశ్వంతపూర్ వందే భారత్ (నెం. 20703) రైలును ఈ నెల 3, 6, 11 తేదీల్లో దారి మళ్లించడానికి నిర్ణయించామని, కానీ 6, 11 తేదీల్లో యథా ప్రకారంగా రైళ్లను నడుపుతామన్నారు. కలబురగి-బెంగళూరు వందే భారత్ (నెం. 22231) రైలును 6న, యశ్వంతపూర్-కాచిగూడ వందేభారత్ (నెం. 20704) రైలును, బెంగళూరు-కలబురగి వందే భారత్ (నెం. 22232) రైలును 11న దారి మళ్లించనున్నట్లు ప్రకటించామని, కానీ ఆ నిర్ణయాన్ని ఉపసంహరించి రైళ్లను యథాప్రకారంగా నడుపుతామని వివరించారు.

**రైళ్ల రద్దు:** ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా గుంతకల్లు-అనంతపురం మీదుగా వెళ్లే అప్ అండ్ డౌన్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. హౌరా-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నెం. 02863)ను ఈ నెల 8, 15 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 02864)ను ఈ నెల 10, 17 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు.

## రేపు ఉద్యోగ మేళా

**అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6:** నిరుద్యోగ యువకుల కోసం గురువారం ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. నవభారత్ ఫర్టిలైజర్స్, పేటీఎం సంస్థల్లో సేల్స్ రెప్రజెంటేటివ్స్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేందుకు 210మంది అభ్యర్థులు కావాలన్నారు. పది నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని తెలిపారు. ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

## గూగూడులో హుండీల ఆదాయం లెక్కింపు

**నార్పల, ఆగస్టు 6:** గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ రెండు హుండీలను పూర్తిగా లెక్కించగా ఆంజనేయస్వామి హుండీకి రూ.6,84,310లు, కుళ్లాయిస్వామి హుండీకి రూ. 1,05,708లు అలాగే వెండి 60కేజీలు, బంగారం 79గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈఓ శోభ తెలిపారు.

## వాయుపుత్రా..! వందనం

ప్రారంభమైన శ్రావణ మాసోత్సవాలు



అంకాలాలలో నెట్టికంటి ఆంజనేయస్వామి మూలవిరాట్టు



ప్రత్యేక అలంకరణలో మురడి ఆంజనేయస్వామి



పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

**గుంతకల్లు, ఆగస్టు6:** శ్రావణ మాస తొలి మంగళవారం సందర్భంగా కసాపురంలోని నెట్టికంటి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే స్వామివారి దర్శనార్థం భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు, వజ్రకవచ, పుష్పాలంకారాలు చేశారు. రాత్రి స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు అలంకారాలుచేసి వెండి రథంపై ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో ఈఓ వై భద్రాజీ, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, సూపరింటెండెంటు వెంకటేశులు పాల్గొన్నారు.

**బొమ్మనహాళ్:** మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామికి శ్రావణమాసం తొలి మంగళవారం విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు జరిపించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నదానం చేశారు.

**డీ.హీరేహాళ్:** శ్రావణమాసం మొదటి మంగళవారం ప్రసిద్ధిగాంచిన మురడి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవ కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో వస్త్రాలంకరణ చేసి పూజలు చేపట్టారు.

## ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం క్రైం,ఆగస్టు 6:** జిల్లా కోర్టు ఆవరణలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ఆఫీస్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో నాలుగు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జడ్జి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. రెండు ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు(రోస్టర్ పాయింట్-2 ఎస్సీ జనరల్), (రోస్టర్ పాయింట్-3 ఓసీ ఉమెన్) రెండు అటెండర్ పోస్టులకు(రోస్టర్ పాయింట్-2 ఎస్సీ జనరల్,(రోస్టర్ పాయింట్-3 ఓసీ ఉమెన్) పోస్టులున్నాయన్నారు. అర్హులైనవారు ఈనెల 14 సాయంత్రం 5గంటలలోపు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా కోర్టు ప్రాంగణం చిరునామాకు దరఖాస్తులు పంపాలని సూచించారు.

## ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదల

**అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6:** జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్ష ఫలితాలను మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ద్వితీయ సెమిస్టర్(ఆర్20) విద్యార్థులకు జూలైలో రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫలితాల వివరాలకోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలనిన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీఈలు లలితకుమారి, విష్ణువర్దన్, విభాగాధిపతులు కళ్యాణిరాధ, మమత, అజిత, భారతి, భువన విజయ, రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## భర్తను చంపిన భార్య




సేవ్యనాయక్ మృతదేహం

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 6:** మండలంలోని గుండాలతండా గ్రామంలో భర్తను భార్య హత్య చేసిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ఎం. సేవ్యనాయక్(40)కు రెండు ఎకరాల పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని కంది, ఆముదం పంటలు సాగు చేశాడు. సేవ్యనాయక్, అతడి పెద్ద కుమార్తె భాగ్యలక్ష్మి సోమవారం వేరుశనగకాయల మెషీన్ పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చారు. అదే సమయంలో మృతుడి భార్య లలితమ్మ పొలానికి వెళ్తూ భర్తను భోజనం తీసుకురమ్మని చెప్పింది. సేవ్యనాయక్ క్యారియర్ తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ భార్య భర్తలు గొడవపడ్డారు. దీంతో లలితమ్మ రాయితీసుకుని సేవ్యనాయక్ ముఖం మీద కొట్టింది. అతను కిందపడటంతో తలకు రక్తగాయమైంది, దీంతో భర్త కట్టుకున్న పంచె తీసి గొంతు బిగించి హత్య చేసింది. తర్వాత ఇంటికి వెళ్లింది. దీంతో సేవ్యనాయక్ గురించి ఆమె తమ్ముడు బాగే నాయక్, చెల్లెలి భర్త(మరిది) అడిగారు. సమాధానం సరిగా చెప్పకపోవడంతో గట్టిగా నిలదీశారు. దీంతో తన భర్తను హత్య చేసినట్లు చెప్పింది. వెంటనే ఈ విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులు కసాపురం పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 11 గంటలకు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రూరల్ సీఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లలితమ్మ అదే గ్రామా నికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, ఇద్దరు కలిసి సేవ్యనాయక్‌ను హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి తమ్ముడు వెంకటేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బిరబిరా కృష్ణమ్మ

- జిల్లాకు చేరిన కృష్ణా జలాలు
- మంగళవారం ఉదయం కసాపురం చేరిన నీరు
- రాత్రికి రాగులపాడు పంప్‌హౌస్‌కు...
- ఏప్రిల్ వరకూ నీటి హామీ కోరుతున్న రైతులు



హంద్రీనీవా కాలువలో పారుతున్న కృష్ణా నీరు

ఇన్‌సెట్‌లో చెన్నప్ప కొట్టాల వద్ద సిద్ధంగా ఉన్న వరి నారు

**గుంతకల్లు, ఆగస్టు 6:** ఆటంకాల మధ్య ఎట్టకేలకు హంద్రీనీవా నీరు మంగళవారం జిల్లాలోకి ప్రవేశించింది. ఉదయం 8 గంటల సమయంలో జిల్లా సరిహద్దులోని బుగ్గసంగాల గ్రామాన్ని దాటిన కృష్ణా నీరు రాగులపాడు పంప్‌హౌస్ వైపు పరుగులు పెట్టింది. శ్రీశైలం డ్యాంలో దాదాపు 20 రోజుల కిందటే పుష్కలంగా నీటి నిల్వ చేరడంతో హంద్రీనీవాలో నీటి ఎత్తిపోతకు ప్రభుత్వ అనుమతి కోసం జల వనరుల శాఖాధికారులు వేచి చూశారు. ఈ నెల 1న పంపింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఒక పంపుతో నీటి ఎత్తిపోతలను ప్రారంభించి, తర్వాత పంపుల సంఖ్యను ఆరుకు పెంచారు. కాగా కర్నూలు జిల్లాలోని బ్రాహ్మణకొట్కూరు వద్ద వంతెన నిర్మాణం కోసం కాల్వను పూడ్చిన కారణంగా ఆటంకం ఏర్పడింది. అలాగే కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం వద్ద కాలువకు గండి పడింది. అప్పటిదాకా కాలువలో ఎగువకు పారిన నీరు మంగళవారం ఉదయం జిల్లా సరిహద్దులను దాటింది. ప్రస్తుతం హంద్రీనీవాలో నీటి ప్రవాహాన్ని తగ్గించినా, నాలుగు రోజుల కిందట ఎత్తిపోసిన నీరు జిల్లాలోకి వచ్చి చేరింది. కాలువలో ప్రస్తుతం దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీరు పారు తోంది బుధవారానికి రాగులపాడు పంప్ హౌస్‌కు నీరు చేరే అవకాశం ఉంది.

### సాగుకు సిద్ధమవుతున్న రైతులు

హంద్రీనీవాకు మల్యాల వద్ద నీటి ఎత్తిపోతలు ప్రారంభంకాగానే జిల్లాలో కాలువకు ఆనుకుని ఉన్న కమతాల్లో మిర్చి, వరి పంటలను సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. గుంతకల్లు మండలంలోని బుగ్గసంగాల, కసాపురం, జీ కొట్టాల, వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం, గడేహోతూరు, చిన్నహోతూరు, విడపనకల్లు మండలంలోని పెంచలపాడు, ఉరవకొండ మండలంలోని శేక్షానుపల్లి, ఉరవకొండ, మోపిడి, తదితర గ్రామాల రైతులు పంటల సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో జూన్, జూలై నెలల్లోనే వరి, మిర్చి నార్లను రైతులు సిద్ధం చేసుకునేవారు. కానీ ఈసారి శ్రీశైలం డ్యాంలో జూలై రెండో వారందాకా తగినంత వరదనీరు వచ్చి చేరకపోవడం తో రైతులు నారు సిద్ధం చేసుకోకుండా వేచిచూశారు. వర్షాలు కూడా పెద్దగా రాకపోవడంతో నారును సిద్ధం చేసుకోవడానికి సంశయించారు.

**హామీ ఇవ్వాలి**

గత ప్రభుత్వ హయాంలో గడచిన రెండు సీజన్లలో ఫిబ్రవరికే నీరు బంద్ అవుతుందని, దీర్ఘకాలిక పంటలు పెట్టుకోవద్దంటూ జలవనరుల శాఖాధికారులు ఇబ్బంది పెట్టారని రైతులు వాపోతున్నారు. గత సంవత్సరం మిర్చి పంటలు పెట్టిన తర్వాత నీరు డిసెంబరు ఆఖరుకే బంద్ అవుతాయంటూ చావుకబురు చెప్పారన్నారు. 2022 సీజన్‌లో ఫిబ్రవరికే నీరు బంద్ అవుతాయంటూ నోటీసులిచ్చి, దండోరా వేయించి రైతులను ఇబ్బంది పెట్టారు. కానీ తక్కువ మోతాదులో మార్చిదాకా నీటిని పారించారన్నారు. ఈ ఏడాది కాలువకు నీరు రావడంలో ఆలస్యం జరిగిందని, ఈసారైనా ఏప్రిల్ వరకూ నీరు ఇస్తామంటూ హామీ ఇవ్వాల ని మిర్చి, కంది రైతులు కోరుతున్నారు.

### ఏప్రిల్ వరకూ నీరివ్వాలి



గత రెండేళ్ల మాదిరిగా కాకుండా ఈసారి ఏప్రిల్ వరకూ నీరు ఇస్తామని సాగునీటి అధికారులు హామీ ఇవ్వాలి. పంటలు పెట్టిన తర్వా త విద్యుదుత్పత్తి కారణంగా డ్యాంలో నీరు అడుగంటిందని, డిసెంబరుకే నీరు నిలిచిపోతుందని చెప్పి ఇబ్బంది పెట్టారు. కానీ తర్వాత ఫిబ్రవరి వరకూ వదిలారు. 2022లో కూడా ఇలాగే చేశారు. ఈసారి మాత్రం రైతులకు ఇబ్బందిలేకుండా హామీ ఇవ్వాలి.

- తిరుమల రావు, జీ కొట్టాల రైతు

## దొంగతనాలను ఆపాదించడం సరికాదు


- జ్యువెలరీ షాపుల అసోసియేషన్ ఆగ్రహం
- కర్ణాటక పోలీసులను నిలదీసిన వైనం



వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద గుమికూడిన జ్యువెలరీ వ్యాపారులు

**ధర్మవరం, ఆగస్టు 6:** ఎవరో ఎక్కడో చేసిన దొంగతనాన్ని జ్యువెలరీ షాపుల యాజమాన్యాలకు ఆపాదిస్తూ ఇబ్బంది పెట్టడం సరికాదంటూ ధర్మవరం జ్యువెలరీ షాపుల అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. కొందరు దుండగులు కర్ణాటకలో బంగారం దొంగిలించి ధర్మవరంలో అమ్మారన్నారు. దీంతో అనంతపురం పోలీసులు దొంగలిచ్చిన సమాచారం మేరకు 20 రోజుల క్రితం రికవరీ చేసినప్పటికి మళ్లీ కర్ణాటక పోలీసులు వచ్చి బంగారం ఇవ్వాలంటూ షాపు యజమాని షాహీర్‌ను తీసుకెళ్తుడటంపై అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. దీంతో కర్ణాటక పోలీసులు, జ్యువెలరీషాపుల యజమానులు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఉద్రిక్తత నెలకొంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్ రహిమాన్ మాట్లాడుతూ పట్టణంలోని షాహీర్‌అనే స్వర్ణకార వ్యాపారిని స్థానిక పోలీసుల సహకారంతో చిత్రదుర్గ పోలీసులు తీసుకెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. గత నెలలోనే అనంతపురం పోలీసులకు కొనుగోలు చేసిన బంగారాన్ని ఇచ్చేశారన్నారు. మళ్లీ చిత్రదుర్గ పోలీసులు వచ్చి అదే బంగారాన్ని ఇవ్వాలని వ్యాపారిని ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మీ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి బంగారుషాపు దుకాణాలపై అభాండాలు మోపడం పద్ధతికాదన్నారు. షామీర్‌ను వదిలేవరకు సంఘం తరఫున చట్టపరంగా పోరాడుతామన్నారు.

## తొణికిసలాడుతున్న తుంగభద్ర



నిండుకుండలా తుంగభద్ర జలాశయం

**బొమ్మనహాళ్, ఆగస్టు 6:** తుంగభద్ర జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 102.335 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 84,696 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 12 క్రస్ట్‌గేట్లు రెండు అడుగులు మేర ఎత్తి 35,592 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలగా 19,635 క్యూసెక్కుల నీరు కాలువలకు వెళుతున్నట్లు తెలిపారు. మొత్తం 55,227 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105 కి.మీ. వద్ద 1300 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

## సెప్టెంబరు నుంచి భారత పశుగణన సర్వే

**అనంతపురం అర్బన్, ఆగస్టు 6:** వచ్చే నెల(సెప్టెంబరు) 1 నుంచి డిసెంబరు నెలాఖరుదాకా 21వ భారత పశుగణన సర్వే నిర్వహించనున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గృహాలు, సంస్థల వద్ద ఉన్న అన్ని జాతుల పశువుల వివరా లను ప్రభుత్వం తయారు చేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. పశుగణన కోసం జిల్లా వ్యాప్తంగా 189 మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్ వైజర్లను పశుసంవర్థక శాఖ అధికారులు, సిబ్బంది నుంచి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. బుధవారం అనంతపురం డివిజన్ కార్యాలయం, ఈనెల 8న ఉరవకొండ డివిజన్ కార్యాలయంలో ఎంపిక చేసిన సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు.

## నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం విద్య, ఆగస్టు 6:** నవోదయ విద్యాలయ సమితి 2025-26 ఏడాదికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు దరకాస్తులు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3వ, 4వ తరగతి ఉత్తీర్ణత సాధించడంతోపాటు, 2024-25లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు, జిల్లాలో నివాసం ఉంటున్న విద్యార్థులు, 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. దరాఖాస్తు చేయడానికి అక్టోబరు 16 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ. జీవోవి.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

## అంతా ఆన్‌లైన్‌లోనే..

- ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పని చేయండి
- ఎవరి స్థాయిలో వారికి పట్టు ఉండాలి
- ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలదే బాధ్యత
- విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్

**అనంతపురం విద్య, ఆగస్టు 6:** ఉపాధ్యాయుల పని సర్దుబాటు అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పని చేయాలని ఆదేశించారు. అన్నింటికీ ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలదే పూర్తి బాధ్యతని హెచ్చరించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ-1, 2లతో ఆర్‌జేడీ మంగళవారం నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాకు తొలిసారి వచ్చిన ఆయనకు డీఈఓ వరలక్ష్మి, ఇతర డిప్యూటీ డీఈఓలు, ఏడీలు, ఎంఈఓలు ఘన స్వాగతం పలికారు. తర్వాత సమీక్షలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖపై ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు చాలా క్లారిటీతో ఉన్నారన్నారు. మండలంపై ఎంఈఓలు, డివిజన్లపై డిప్యూటీ డీఈఓలు, జిల్లాపై డీఈఓ పూర్తి స్థాయిలో అవగాహనలో ఉండాలన్నారు. పత్రికల్లో ఏ చిన్న వార్త వచ్చినా నేరుగా కమిషనర్‌కు వెళ్తుందని, అక్కడి నుంచి అడిగే వరకూ మీరు నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. పై నుంచి అడిగినటప్పుడు తెలియదు, కనుక్కొని చెబుతా అంటూ సమాధా నం చెబితే కుదరదని హెచ్చరించారు. ఆగస్టు 15 తర్వాత విద్యాశాఖ మంత్రి లోకేశ్, సెక్రెటరీ, కమిషనర్ తనిఖీలకు వచ్చే అవకాశం ఉందన్నారు. చాలా మంది ఎంఈఓలకు స్కూళ్ల వివరాలు కూడా సరిగ్గా తెలియదన్నారు. ప్రధానం గవర్నమెంట్, ఎయిడెడ్, ప్రైవేట్ ఈ మూడు కేటగిరీ స్కూళ్ల వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. నిత్యం లెసన్ ప్లాన్‌పై హెచ్ఎం సైన్ చేసి పర్యవేక్షించాలన్నారు. తర్వాత జరిగే ఉపాధ్యాయుల పని సర్దుబాటు అంతా ఆన్‌లైన్‌లోనే పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, పక్కాగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని ఆయన డిఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, ఏసీ గోవింద్ నాయక్, ఏడీలు క్రిష్టయ్య, నాగరాజు, డిప్యూటీ డీఈఓలు రంగస్వామి, శ్రీనివాసులు, శ్రీదేవి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శామ్యూల్, వేదికపై డీఈఓ వరలక్ష్మి, ఇతర అధికారులు

## పాలపాటిదిన్నెలో ఏర్పాట్ల పరిశీలన



ఆలయంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న ఎస్ఐ లింగన్న

**నల్లచెరువు, ఆగస్టు 6:** మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను, పరిసరాలను ఎస్ఐ కేఎం. లింగన్న మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఈఓ రవీంద్రరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... పాలపాటిదిన్నెలో ప్రతియేడాది అత్యంత వైభవంగా జరిగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లపై పరిశీలించామన్నారు. ఈఓ మాట్లాడుతూ.. భక్తులకు అన్నదానం, తాగునీరు, వాహనాల పార్కింగ్, క్యూలైన్లు ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడతామన్నారు.

## డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

**ధర్మవరంరూరల్/తాడిమర్రి/గాండ్లపెంట, ఆగస్టు6:** బిందు, తుంపర సేద్యం ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం అవసరమైన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ధర్మవరం ఎంపిఏఓ శివశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులువన్‌బీ, ఎఫ్ఎంబీ స్కెచ్, చెక్‌బందీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు పాసుపుస్తకం, బోరుబావి కరెంట్ బిల్లు తీసుకుని రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ బోరు బావులు ఉండి నీటి వసతి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 7995010080 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే కదిరి నియోజకవర్గ పరిధిలోని రైతులు బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిఏఓ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

**ముదిగుబ్బ, ఆగస్టు6:** మండల పరిధిలోని సంకేపల్లి పంచాయతీలో మంగళవార ం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 50మందికి రూ. 5లక్షల జరిమానా విధించినట్లు అనంతపురం విద్యుత్ విజిలెన్స్ ఏడీలు రామాంజినేయులు, నాగేంద్ర తెలిపారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈలు జగన్నాథం, అశోక్, చంద్రశేఖర్, మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్‌ను కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు



నారా లోకేశ్‌తో రామాంజనేయులు

**కదిరి, (అమడగూరు),ఆగస్టు 6:** మండలంలోని నిలువురాతి పల్లికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు నాయుడు మంగళవారం రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌ను మంగళగిరిలోని ఆయన స్వగృహంలో కలిశారు. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.. కష్టపడిన ప్రతి కార్యకర్తకు టీడీపీలో గుర్తింపు, గౌరవం ఉంటుందని నారా లోకేశ్ అన్నారన్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి అభినందలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు ఇడగొట్టు రాంబాబు, కిరణ్ కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మా ఖాతాలో డబ్బులు ఏమయ్యాయి?

**నల్లమాడ ఆగస్టు 6:** మండలకేంద్రంలోని పోస్టాఫీస్‌లో తమ ఖాతాల్లోని డబ్బులు ఏమయ్యాయని పలువురు ఖాతాదారులు ఆ శాఖ అధికారులను మంగళవారం ప్రశ్నించారు. ఖాతాల్లో సొమ్ము మాయమైందని, దీనిపైన 25 రోజులనుంచి అధికారులు విచారణ చేస్తున్నారని అన్నారు. తమకు న్యాయం చేస్తామని చెప్పారేకానీ, ఇంతవరకు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే తమ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమండ్ చేశారు. లేదంటే కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని ఖాతాదారులు హెచ్చరించారు.

## ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 6:** మండలకేంద్రంలో ఆధార్ కేంద్రాం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించాలని సీఐటీయూ నాయకులు కుళ్లాయప్ప, శ్రీరాములు, సీపీఐ మండలకన్వీనర్ చలపతినాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో గతంలో ఆధార్ కేంద్రం ఉండేదన్నారు. కొన్ని నెలల క్రితం బరిష్ మరమ్మతులకు గురికావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనారు. స్థానికంగా ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు నానా తంటాలు పడాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే స్థానిక ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాని కోరారు.

## విద్యాసామగ్రి పంపిణీ

**కొత్తచెరువు, ఆగస్టు 6:** మండలంలోని పోతులకుంట గ్రామం ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు కిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామగ్రి పంపిణీచేశారు. సత్యసాయిబాబా భక్తుడు లక్ష్మీనారాయణ తన కుమార్తె రమ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు పలకలు, ప్యాడ్స్, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు రవి,సుజాత, ట్రస్టు సభ్యులు షెక్షావలి, షాకీర్ పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీ

రూ.11లక్షల నగదు, రెండు కిలోల వెండి అపహరణ

**కదిరి, ఆగస్టు 6:** పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో రూ.11లక్షల నగదు, రెండు కిలోల వెండి చోరీ అయినట్లు ఇంటి యజమాని మధుసూదన్ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపారు. ఇంటి యజమాని కుటుంబంతో సోమవారం బంధువుల ఊరికెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంట్లో ఉన్న నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. అతడు మంగళవారం ఉదయం ఇంటికి వచ్చాక నగదు, వెండి మాయమైనట్లు గుర్తించాడు. మధుసూదన్ చేసిన ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మధుసూదన్ మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. బాగా తెలిసిన వ్యక్తులే డబ్బు, వెండి ఎత్తుకెళ్లి ఉంటారని అతడు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గొలుసు అపహరణ

**ధర్మవరం, ఆగస్టు 6:** పట్టణంలోని కాలేజ్‌సర్కిల్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగ అపహరించుకుని వెళ్లిన విషయం ఆలస్యంగా తెలిసింది. పట్టణానికి చెందిన పాపమ్మ అనే మహిళ రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు ఆదివారం ఉదయం 7గంటల సమయంలో వెళ్తోంది. వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని దొంగ ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారం గొలుసును లాక్కొని పరారయ్యాడు. దీంతో సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

## గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి

**ధర్మవరం, ఆగస్టు 6:** పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు దాసరి వేణుగోపాల్(44) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. వేణుగోపాల్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. అతడు సోమవారం రాత్రి 7గంటల సమయంలో ఇంట్లో మగ్గం నేస్తూ ఉన్నట్టుండి కుప్పకూలిపడిపోయాడు. కుటుంబసభ్యులు వేణుగోపాల్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య దాసరి దుర్గ ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వసతిగృహాల్లో వసతులు కల్పించాలి

- ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**పుట్టపర్తి, ఆగస్టు 6:** జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలికవసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారంటూ ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వారు మంగళవారం నిరసన ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నినాదాలుచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.... జిల్లాలో వందకు పైగా వసతిగృహాలు ఉన్నాయని, వాటిలో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. కొన్ని వసతిగృహాలు శిధిలావస్థకు చేరాయన్నారు. పలుమార్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదన్నారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, శేషం మహేంద్ర, నరసింహమూర్తి, దేవరాజు, గణేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

**కదిరి అర్బన్, ఆగస్టు 6:** అదనపు కట్నం కోసం తన భర్త, అత్తంటివారు వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రాజేశ్వరిని ఏడేళ్ల క్రితం కదిరి మండలంలోని కొండమనాయునిపాళ్యానికి చెందిన ఆనంద్‌రెడ్డికిచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో పది తులాల బంగారం, రూ.50వేలు నగదు కట్నం కింద ఇచ్చారు. అయితే అదనపు కట్నం కోసం తన భర్త అనంద్‌రెడ్డి, అత్త అశ్వత్థమ్మ, ఆడపడుచులు సర్వతి, చిట్టెమ్మ, లత తనను వేధిస్తున్నట్లు రాజేశ్వరి మంగళవారం ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మంత్రి సత్యకుమార్ శుభాకాంక్షలు

**ధర్మవరం రూరల్, ఆగస్టు 6:** అంతర్జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం చేనేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ధర్మవరంలోని కదిరిగేటు వద్ద నున్న నేతన్న విగ్రహం వద్ద బుధ వారం నిర్వహిస్తున్న చేనేత కార్యక్రమంలో పాల్గొ నాల్సి ఉందని, అయితే క్యాబినెట్ సమావేశాల కారణంగా హాజరు కాలేక పోతున్నానని మంత్రి మంగళవారం ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ధర్మవరం చేనేత రంగానికి సంబంధించిన ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై నేతన్న విగ్రహానికి పూలమాలలు వేయాలని కోరారు. ధర్మవరం కుటుంబసభ్యుల మధ్య ఇలాంటి కార్యక్రమంలో పాల్గొన లేకపోవడం చాలా వెలితిగా ఉందని ట్విట్టర్ ద్వారా ఆయన సందేశాన్ని పంపించారు.

### చేనేత దినోత్సవంలో పాల్గొననున్న పరిటాల శ్రీరామ్

**ధర్మవరం:** అంతర్జాతీ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించే కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతారని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి బుధవారం ఉదయం 10గంటలకు పరిటాల శ్రీరామ్ పూలవమాల వేస్తారని తెలిపారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధసంస్థల నాయకులు పాల్గొనాలని కోరారు.

## సమస్యలను పరిష్కరించండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**పుట్టపర్తి, ఆగస్టు 6:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్షచేశారు. జిల్లాలో 975 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కేవలం 109 మాత్రమే పరిష్కరించారని, మిగిలినవి సకాలంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా కదిరి, ధర్మవరం డివిజన్ స్థాయిలో ఎక్కువ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించ డంలో అలసత్వం ప్రదర్శించవద్దని అదికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఈఈ, టీడీపీ నాయకులు

ఈఈ మోసెస్

**ముదిగుబ్బ, ఆగస్టు6:** మండలంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని ఆ శాఖ కదిరి ఈఈ మోసెస్ పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం 11కేవీ విద్యుత్ వైరు తెగిపడి ఇద్దరు మహిళలకు గాయాలైన సంఘటన తెలిసినదే. ఈ నేపథ్యం లో ఈఈ మోసెస్, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఈఈ మోసెస్ విలేకరులతో మాట్లాడుతూ... ముదిగుబ్బలో సుమారు 30సంవత్సరాల కిందట విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేశారని, అవి పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వాటిని తొలగించి, కొత్తగా విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేటప్పుడు ఆటంకం కలిగించకుండా ప్రజలు సహకరించాలన్నారు. అలాగే మండల వ్యాప్తంగా విద్యుత్ ఓల్టేజ్ సమస్య లేకుండా కొత్తగా ఆరు సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పాతవూరు గ్రామానికి 24గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. మండలంలో నెలకొన్న విద్యుత్ ఆపరేటర్ల సమస్యను పరిష్కరించి, త్వరలోనే సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ముదిగుబ్బలో విద్యుత్ లైన్ల మరమ్మతులకు తగిన సామగ్రి సబ్‌స్టేషన్ వద్ద నిల్వ ఉంచినట్లు ఈఈ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

**ధర్మవరం, ఆగస్టు 6:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 2023 -24 సంవత్సరంలో పదో తరగతిలో 540 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రోత్సాహకాలు అందిస్తామని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ, కార్యదర్శి శంకర యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 4గంటలకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

## దుగినేపల్లి మైనింగ్‌పై సమాచారం ఇవ్వండి

రెవెన్యూ అధికారులకు వినతి



దుగినేపల్లి వద్ద మైనింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

**తనకల్లు, ఆగస్టు 6:** మండలంలోని దుగినేపల్లి వద్ద సర్వే నెం.1192లో నిర్వహిస్తున్న మైనింగ్ సక్రమమో, అక్రమమో తేల్చి చెప్పాలని గ్రామానికి చెందిన జియావుల్లా మంగళవారం తహసీల్దార్ శోభా వర్ధమ్మకు వినతిపత్రం అందించారు. గ్రామంలో ఎలాంటి విచారణ చేయకుండా, గ్రామసభ నిర్వహించకుండా మైనింగ్‌కు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. మైనింగ్‌కోసం 2019నుంచి ఇప్పటివరకు ఎవరికి ఎలాంటి తీర్మానాలు ఇవ్వలేదని గ్రామ పంచాయతీ వారు రాతపూర్వకంగా తెలిపారన్నారు. మైనింగ్ వలన గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశువులు అడవికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై విచారణ చేసి, సమాచారం అంది స్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయంపై మైనింగ్ యజమాని రహీమ్‌ను వివరణ కోరగా, తనకు ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించండి: ఏపీఎం

**నల్లమాడ, ఆగస్టు 6:** మండల వ్యాప్తంగా వెలుగు సంఘంలో పనిచేస్తున్న యానిమేటర్లు మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని ఏపీఎం జయంతి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నూతన యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... యానిమేటర్లు వెలుగు సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆమెతోపాటు సీసీలు నరసింహారెడ్డి, చౌడప్ప, అకౌంటెండ్ ఓబులమ్మ, యానిమేటర్లు, టీడీపీ మండలకన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, శివారెడ్డి, కులశేఖర్ నాయుడు, రాజారెడ్డి, మైలే రామచంద్ర పాల్గొన్నారు.

## ముర్రుపాలు.. బిడ్డకు మొదటి టీకా



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కౌసల్యసాయి

**బుక్కపట్నం, ఆగస్టు 6:** తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యసాయి పేర్కొన్నారు. బుక్కపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ చిన్నారులకు అన్నప్రాసన చేశారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. తల్లిపాలల్లో వ్యాధి నిరోధిక శక్తి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గోవిందమ్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## రాగి సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

డీడీఏ విద్యావతి



రైతులతో మాట్లాడుతున్న డీడీఏ విద్యావతి

**ధర్మవరం రూరల్, ఆగస్టు 6:** రాగిపంట సాగుచేస్తే ప్రభుత్వం విత్తనాలను అందివ్వడంతో పాటు పండిన పంటను గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయశాఖ డీడీఏ విద్యావతి తెలిపారు. ఆమె మంగళవారం మండలంలోని చిగిచెర్ల రైతుసేవా కేంద్రంలో రాగిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీఏ రైతులతో మాట్లాడుతూ... త్వరలోనే రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేస్తామని, రైతులందరూ ప్రత్యామ్నాయ పంటగా రాగి సాగుచేయాలన్నారు. పంటకు పెట్టుబడి కూడా తక్కువగా ఉంటుందని, మంచి దిగుబడులతో లాభాలు వస్తాయన్నారు. ప్రస్తుతం రాగులకు మార్కెట్‌లో విపరీతంగా డిమాండ్ పెరిగిందని, రైతులు రాగిపంటను సాగుచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ అబ్దుల్‌అలీ, హార్టికల్చర్ అసిస్టెంట్ భార్గవ్, రైతులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి

**పుట్టపర్తిరూరల్, ఆగస్టు 6:** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే అపివేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనేయులు డిమాండు చేశారు. ఏఐటీయూసీ జాతీయసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిస్తూ సీపీఐ స్థానిక కార్యాలయంలో మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖస్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణ ప్రయత్నాలను వెంటనే ఆపాలన్నారు. కార్మికులకు కనీసవేతనం కింద రూ. 26వేలు ఇవ్వాలని, .కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, సిబ్బందిపై రాజకీయ నాయకుల వేదింపులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధనాయక్, బాబు, రమణ పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



శ్రీనివాసులు మృతదేహం

**లేపాక్షి, ఆగస్టు 6:** పందుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ గోపీ తెలిపిన వివరాల మేరకు కొండూరు సబ్‌స్టేషన్‌కు కిమీ దూరంలో కొంతమంది పందుల వేటగాళ్లు పందుల కోసం విద్యుత్ తీగలను ఏర్పాటుచేశారు. కొండూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు(38) సోమవారం రాత్రి పని నిమిత్తం గలిబిపల్లికి వెళ్లి కాలినడకన తిరిగి వస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్థులు ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సుభాషిణి, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## లారీని ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

**పెనుకొండ రూరల్, ఆగస్టు 6 :** మండలంలోని హరిపురం వైజంక్షన్‌వద్ద 44వ జాతీయ రహదారిపై లారీని ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రేకులకుంట గ్రామానికి చెందిన పవన్, భార్య పెనుకొండకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నారు. హరిపురం వైజంక్షన్ వద్ద బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ స్పీడ్ బ్రేకర్లవద్ద సడన్ బ్రేక్ వేశారు. దీంతో వెనకాల వస్తున్న ఆటో లారీని ఢీ కొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పవన్, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రమాదాలకు నిలయంగా రహదారి



జిల్లాకేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఇలా...

**కొత్తచెరువు, ఆగస్టు 6:** మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధానరహదారి మురుగునీటితో కోతకు గురైంది. దీంతో రోజూ ఆ మార్గంలో వెళ్లే ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతు న్నారు. అలాగే తారు రోడ్డుపై ఎక్కువగా గుంతలు ఉండటంతో దగ్గరకు వచ్చేంత వరకు అవి కనపడవు. దీంతో ద్విచక్రవాహన దారులు తీరా గుంత వద్దకు వచ్చాక గమనించి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి కిందకు పడుతున్నారు. మండలకేంద్రానికి చెందిన ద్విచక్రవాహన దారుడు మంగళవారం పుట్టపర్తి నుంచి కొత్తచెరువుకు వెళ్తున్నాడు. రోడ్డుపై ఉన్న గుంతను గమనించకుండా వెళ్లడంతో వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో ద్విచక్రదారుడికి చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వా స్పత్రికి తరలించారు. ఇప్పటికైన ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై పడిన గుంతలను పూడ్చాలని ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు.

## అన్న క్యాంటీన్ల పరిశీలన




అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

**ధర్మవరం, ఆగస్టు 6:** పట్టణంలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్లను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ఎల్‌పీ సర్కిల్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్‌తో కలిసి జేసీ పరిశీలించారు. దగ్గరుండి ఏర్పాట్లు పూర్తి చేయించిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్‌ను అభినందించారు. అనంతరం పలు విషయాలపై జేసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల హర్షం

**ముదిగుబ్బ, ఆగస్టు6:** ఉపాధ్యాయులను ఎంతో కాలం నుంచి మనోవేదనకు గురిచేస్తున్న మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత నుంచి తప్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం మాట్లాడుతూ... ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైద్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపైన అనేక రకాలైన బోధనేతర పనులు మోపి, మానసికంగా వేధించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల బాధను అర్థం చేసుకొని స్నేహపూర్వకంగా వ్యవహరించడం హర్షణీయమన్నారు. ఉపాధ్యా యులు ఫకృద్దీన్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, నారాయణ, షమ్మీ, సత్యనారాయణ, ఆదినారాయణ, గౌడ్, నాగేంద్ర, కుమార్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలి

- బీజేపీ నాయకుడు కాపు

**ధర్మవరం, ఆగస్టు 6:** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఈ నెల 15న ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవే యాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాపు రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. బీజేపీ స్థానిక కార్యాలయంలో ఆయన మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జోనల్, జిల్లా, మండలస్థాయిలో కమిటీలను కూడా ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 11 నుంచి 13వతేదీ వరకు యువమోర్చా తిరంగా బైకు యాత్రను నిర్వహిస్తామని, జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేసి నివాళులర్పిస్తాన్నారు. అలాగే మౌనయాత్ర చేపడుతామన్నారు. ఈ షమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బాలకృష్ణయాదవ్, పార్లమెంట్ సంయోజక్ రమణమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి అమరదేవేంద్ర, జాతీయయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సేంద్రియ వ్యవసాయం లాభదాయకం'

**కదిరి, ఆగస్టు 6:** సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని కిసాన్ మోర్చా ఆర్గనిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శంకర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కదిరి మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో యువరైతులు ఇమ్రాన్, ఉజాహిత్ సేంద్రియ పద్ధతిలో బొప్పాయి పంట సాగుచేశారు. ఆ పంటను మంగళవారం శంకర్‌కుమార్‌రెడ్డి సందర్శించి, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకంతో వ్యవసాయం భారంగా మారిందన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు సాధించడంతోపాటు ఆరోగ్యకరమైన పంటలు ప్రజలకు అందించవచ్చన్నారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రీయ పద్ధతుల్లోనే పంటలను పండించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**కదిరి అర్బన్, ఆగస్టు 6:** ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర పరిశీలకుడు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సంబంధిత పోస్టర్లను మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తరువాత సెప్టెంబరు 4వరకు రూ.200 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతికి 14 సంవత్సరాలు, ఇంటర్‌కు పదోతరగతి ఉత్తీర్ణలై, 15 సంవత్సరాలు నిండినవారు అర్హులన్నారు. యువకులు, మహిళలు, వృత్తి వ్యాపారులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిశీలకులు లాజర్, ఎంఇఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం తదితరులున్నారు.

## విద్యార్థులకు క్రీడాపోటీలు



గెలుపొందిన విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి

**నల్లచెరువు, ఆగస్టు 6:** మండకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ షఫీ మాట్లాడుతూ.. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపుతామన్నారు. అండర్ 14, 16 విభాగాల్లో వంద మీటర్ల పరుగు పందెంలో సుజిన్, సఫీయా, లాంగ్‌జంప్ లో సుజిన్, షాట్‌పుట్‌లో మీనారెడ్డి, శైలజా విజేతలుగా నిలిచారు. అలాగే 200 మీటర్ల పరుగుపందెంలో మహేశ్వరి, వేదవతి, 600 మీటర్లలో గోపిక, అరుంధతి, లాంగ్‌జంప్‌లో గోపిక, షాట్‌పుట్‌లో మధు, విజయలక్ష్మి ప్రతిభ చూపినట్లు తెలిపారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనాథ్‌రెడ్డి, సుబహాన్, పీడీలు చిన్నరెడ్డెప్ప, సంధ్యారాణి, రాధ, సుజాత, దర్బార్‌బీ, హరి పాల్గొన్నారు.

# కబ్జాను అడ్డుకున్నందుకు దాడి

## వైసీపీ నాయకుల దౌర్జన్యం.. వృద్ధురాలికి గాయాలు



కబ్జాకి యత్నిస్తున్న స్థలం ఇదే..



గాయపడిన వృద్ధురాలు జయమ్మ

**చిలమత్తూరు, ఆగస్టు 6:** ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి వీలు లేదని అడ్డుకున్నందుకు వైసీపీ సానుభూతిపరులు టీడీపీ నాయకులపై దాడి చేశారు. ఈ దాడిలో 65 సంవత్సరాలు వృద్ధురాలు జయమ్మ తీవ్రంగా గాయపడి బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మండలంలోని దేమకేతేపల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి అంజినప్ప ఇంటి ముందు 1.5 సెంట్ల స్థలం పబ్లిక్ స్థలంపై వైసీపీ నాయకుడు గోపాల్ కన్ను పడింది. పక్కనే ఉన్న తన ఇంటి జాగాలోకి కలుపుకోవడా మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నాడు. ఆయన ప్రయత్నాలను అంజినప్ప కుటుంబ సభ్యులు అడ్డుకుంటూనే ఉన్నారు. సోమవారం సాయంత్రం గోపాల్ కుటుంబ సభ్యులు ఆ స్థలంలో శాశ్వత కట్టడాలకు ఇటుకలు సిద్ధం చేశారు. దీంతో అంజినప్ప కుమారుడు వేణు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గోపాల్, అతని భార్య శాంతమ్మ కలిసి వేణు చిన్నమ్మ జయమ్మపై దాడిచేసి గాయపరిచారు. జయమ్మను ఆస్పత్రికి తరలించారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

### కబ్జాను అడ్డుకున్నందుకే..: అంజినప్ప

గ్రామంలో అందరికీ అవసరమయ్యే స్థలాన్ని కబ్జా చేయకుండా అడ్డుకున్నందుకే తమ కుటుంబంపై దాడి చేశారు. దీనికి రాజకీయ రంగు పులుముతూ టీడీపీ నాయకులు దాడి చేశారంటూ వైసీపీకి చెందిన మీడియాలో ప్రచారం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా 1.5 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. అది ప్రభుత్వానికి సంబంధించినది. అందులో కట్టడాలు కడితే ఎలా..? దాడులు చేయడం టీడీపీ సంస్కృతి కాదు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

# పాత రోడ్డును కొనసాగించాలి: సీపీఎం




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**పెనుకొండ టౌన్, ఆగస్టు 6 :** చాలా సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న పాత రహదారినే కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పెనుకొండ పట్టణంలోని కోనాపురం, మంగాపురం, డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారి వివాదంపైవిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును ఇప్పుడు పట్టా భూమి అంటూ హైకోర్టు ఉత్తర్వుల పేరుతో వాస్తవాలు కప్పిపుచ్చడం తగదన్నారు. కొందరు రియల్టర్ల ప్రయోజనం కోసం మూడు గ్రామాల ప్రజలలతోపాటు విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఏర్పాటుచేసిన రోడ్డును తొలగించి పాతరోడ్డును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, కమిటీ సభ్యులు నారాయణ, వెంకటరాముడు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# పంట నమోదు తప్పనిసరి: ఏఓ



మాట్లాడుతున్న ఏఓ మునికృష్ణ

**గోరంట్ల, ఆగస్టు 6:** ప్రతి రైతు సాగుచేసిన పంటలను ఈక్రాపింగ్ చేయించుకోవాలని ఏఓ మునికృష్ణ సూచించారు. మండలంలోని మలసముద్రం, గౌనివారిపల్లి పంచాయతీల్లో ఈపంట నమోదుపై ఏఓ మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం అధికారులు వచ్చినపుడు రైతులు అందుబాటులో ఉంటూ సాగుచేసిన పంటను నమోదు చేయించాలన్నారు. పంట నమోదు వలన పంటల బీమా, రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, బ్యాంకు రుణాలు సులువుగా అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలసముద్రం సర్పంచ్ భర్త అశ్వత్థరెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పుష్పావతి, కార్యదర్శి సంయుక్త, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అగళి:** మండలంలోని రైతులు ఈ-పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏఓ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌జిపల్లి, ఇరిగేపల్లి, హెచ్‌డీపల్లి, రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# బాధ్యతగా పనిచేయాలి: పీడీ

**హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 6:** యానిమేటర్లు బాధ్యతగా పనిచేసి డ్వాక్రా వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మంగళవారం సోమందేపల్లిలోని సరస్వతి మండల సమైఖ్య సమావేశ భవనంలో జరిగిన యానిమేటర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాలపట్ల యానిమేటర్ల బాధ్యత, సేవలు, పనితీరు విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ ఏరియా కోఆర్డినేటర్ రామిరెడ్డి, ఏపీఎం రామాంజనేయులు, ట్రైనర్ మదార్‌సాబ్, రామచంద్రప్ప, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

**పెనుకొండ, మార్చి 6:** విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డిప్యూటీ డీఈఓ రంగస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దర్గాపేటలోని ఎంపీపీ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఈఓ రంగస్వామి, మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, హెచ్‌ఎం కరణం రఘునాథ్‌రావు, ఉపాధ్యాయుడు వలీవుల్లా, మహిధర్, జేవీవీ కార్యదర్శులు బాబా, నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

# బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి: టీడీపీ

**మడకశిర రూరల్, ఆగస్టు 6:** ప్రభుత్వం అందించే నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, కల్లుమర్రి సర్పంచు గంగమ్మ, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ్ తెలిపారు. మంగళవారం ఏల్లోటి గ్రామంలో డీలర్ షాపును వారు ప్రారంభించారు. డీలర్ నరసింహప్ప, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మురుగునీటితో కంపు కొడుతున్న వీధులు

**పెనుకొండ, ఆగస్టు 6:** పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు రోడ్డుపై పారి వీధులన్నీ కంపు కొడుతున్నాయి. పాదచారులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న వీధులు మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్ల పక్కన ఉన్న హోటళ్లలో మురుగునీరన్నీ రోడ్లపై పారి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనతో సమీప ఇండ్లవారు ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



వీధుల్లో పారుతున్న మురుగునీరు

# కమీషన్ల కక్కుర్తి..!



● వైద్య పరీక్షల కోసం ఫలానా చోటుకు వెళ్లాలని సూచన ● ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రైవేటు ల్యాబ్‌ల బుక్‌లెట్లు

**హిందూపురం అర్బన్, ఆగస్టు 6:** అత్యవసర వైద్య సేవలు, రోగులకు సూచనలు, సలహాలు అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. సాధారణంగా అక్కడికి గ్రామీణులు, గర్భిణులు, పేదలు అధికంగా చికిత్స నిమిత్తం వస్తుంటారు. అక్కడ ఒక వైద్యుడితో పాటు ల్యాబ్‌లు, రక్తపరీక్షల నమూనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింటారు. అత్యవసర పరిస్థితుల్లోనే పెద్దాసుపత్రికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఇటీవల పీహెచ్‌సీల్లో ప్రైవేట్ ల్యాబ్‌ల దందా కొనసాగుతోంది. కొత్తగా స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రారంభించాం, రోగులను పంపండి కమీషన్లు ఇస్తాం అని సిబ్బందితో బేరాలు కుదుర్చుకుంటున్నారు. కమీషన్లకు ఆశపడున్న కొందరు ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపడంపై విమర్శలు వెల్లువెత్తుతన్నాయి. అక్కడైతే త్వరగా అయిపోతుంది..ఆ రిపోర్టులు చాలా కరెక్ట్‌గా ఉంటాయని చెప్పి మరీ పంపుతున్నారు. అమాయకులైన రోగులు సిబ్బంది సూచించిన సెంటర్లకు వెళ్లి మరీ పరీక్షలు చేయించుకుంటున్నారు. అక్కడ వాళ్లు రోగుల నుంచి పలు పరీక్షల పేరుతో డబ్బులు దండుకుంటున్నారు. ఏకంగా ప్రైవేట్ డయాగ్నిస్టిక్ సెంటర్‌లు, స్కానింగ్, ల్యాబ్ సెంటర్లకు సంబంధించిన బుక్‌లెట్‌లు ఆరోగ్య కేంద్రంలో ఉంచడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పట్టణ పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దివ్యా స్కానింగ్, ల్యాబ్స్ సంబంధించిన బుక్‌ను వుంచుకొని రెఫర్ చేయడం గమనార్హం. ఇదేంటని ప్రశ్నిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సౌకర్యం లేదు..అక్కడైతే బాగుందని చెప్పడం విశేషం.




పీహెచ్‌సీలో ప్రైవేట్ ల్యాబ్ బిల్లులు

### కొరవడిన పర్యవేక్షణ

పీహెచ్‌సీ సెంటర్‌లను సంబంధిత అధికారులు, జిల్లాస్థాయి అధికారులు, డీఎంహెచ్‌ఓ తనిఖీ చేపట్టక పోవడంతోనే అక్రమాలకు తెరతీస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడో నెలకోసారి వచ్చి జిల్లా ఆసుపత్రిలో సమావేశం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా నాలుగు మాటలు చెప్పి వెళ్లిపోతున్నారు. దీంతో ఏ అధికారి సెంటర్‌కు రారు అని యథేచ్ఛగా పని కానిచ్చేస్తున్నారు. జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

### చర్యలు తీసుకుంటాం: మంజువాణి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

పీహెచ్‌సీల్లో ఫలానా సెంటర్‌కే వెళ్లాలని ఎవరూ సూచించకూడదు. అలా ఎవరైనా చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. ప్రాథమి ఆరోగ్య కేంద్రాల్లో అల్ట్రా సౌండ్ స్కానింగ్, లాంటివి లేవు. కాబట్టి కొన్ని పరీక్షలు ప్రైవేట్ వారితో ఎంఓయూ చేసుకున్నాం. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వెళ్ళిన వారికి ఉచితంగా పరీక్షలు చేస్తారు. తరువాత మూడు నెలలకు ఒక మారు బిల్లులు చెల్లిస్తాం.

# విద్యార్థులున్నా మూసేస్తారా?

● వసతిగృహాల్లో సౌకర్యాలపై నిర్లక్ష్యం వీడండి
● హాస్టల్ వార్డెన్లతో సమీక్షలో ఎమ్మెల్యే



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, గుండుమల

**మడకశిరటౌన్, ఆగస్టు 6:** హాస్టళ్లలో విద్యార్థులున్నా మూసివేయాలని ఎలా లేఖ రాస్తారు.. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వసతిగృహాలపై నిర్లక్ష్యం వహిస్తే ఎలా అంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.. వార్డెన్లపై మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బీసీ, ఎస్సీ హాస్టల్ వార్డెన్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు కొన్ని హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెంకులు ఊడిపోయి వర్షం వస్తే కారుతున్నా ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించకపోవడం తగదన్నారు. బాలికల హాస్టళ్లు మరీ దారుణంగా ఉన్నాయని, ఎంపీ గ్రాంట్స్ ద్వారా రూ.50లక్షల మంజూరుకు నివేదిక ఇవ్వాలన్నారు. టిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీరునింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా సంఘాలకు సంబంధించిన సభ్యులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

### గురుకుల పాఠశాల తనిఖీ

**మడకశిర(అమరాపురం):** అమరాపురం మండలం హాలుకూరు పరిధిలో ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తనిఖీ చేశారు. పాఠశాల సమస్యలపై సిబ్బందిని అడిగి పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మారుతీప్రసాద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, వాల్మీకి జిల్లా కన్వీనర్ మంజునాథ్ పాల్గొన్నారు.

# న్యాయం చేయాలని వినతి



డీటీకి సమస్య వివరిస్తున్న రైతులు

**హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 6:** తమకు న్యాయం చేయాలని మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నడింపల్లి పంచాయతీ పరిధిలోని పోలేపల్లి, పెద్దబాబయ్యపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ఉన్న 345 ఎకరాల శోత్రియం భూముల్లో 40ఏళ్లుగా 110మంది రైతులు సాగులో ఉన్నారన్నారు. వారికి కొత్త పాసుపుస్తకాలు అందించాలనీ, 1బీలో ఎక్కించాలని పలుమార్లు కోరినా అధికారులు విచారణ లేకుండా తమ పట్టాలు రద్దు చేశారన్నారు. దీనిపై న్యాయం చేయాలని వారు కోరారు. డీటీ శంకర్ మాట్లాడుతూ.. సమస్య తన పరిధిలోలేదని ఉన్నతాధికారుల నిర్ణయంపై ఏమీ చేయలేనన్నారు. రైతులు రామాంజినప్ప, ఎలవమారెప్ప, ఎలవ నారాయణప్ప, రామాంజినప్ప, ఎలవ సుజాతమ్మ, ఎలవ అశ్వర్థప్ప, హరిజన నరసమ్మ, అలివేలమ్మ, గోవిందప్ప, ముద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ డీఎస్పీ ఇంట్లో చోరీ

● బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

**హిందూపురం, ఆగస్టు 6:** పట్టణంలోని రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ డీఎస్పీ గిరిధర్ ఇంట్లో దొంగలు పడ్డారు. డీఆర్ కాలనీ సమీపంలో రిటైర్డ్ డీఎస్పీ గిరిధర్ నివాసముంటున్నారు. నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బెంగళూరు వెళ్లారు. సోమవారం రాత్రి తిరిగి వచ్చి చూడగా.. తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలకు వెళ్లి చూడగా.. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 3 తులాల మూడు ఉంగరాలతోపాటు అరకిలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. చోరీపై టూటౌన్ పోలీసులకు రిటైర్డ్ డీఎస్పీ సమాచారం అందించారు. డీఎస్పీ కంజాక్షన్ ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. పుట్టపర్తి నుంచి క్లూస్‌టీంని రప్పించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మాజీ పోలీసు అధికారి ఇంట్లోనే చోరీ జరగడంతో సమీప నివాసాల్లో ఉన్న ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సీసీ కెమెరాలు ఉండి ఉంటే దొంగలను గుర్తించేందుకు వీలుండేదని పోలీసులు పేర్కొంటున్నారు.



బీరువాను ధ్వంసం చేసిన దొంగలు

# అపరిశుభ్రతపై కదిలిన అధికారులు

**గోరంట్ల, ఆగస్టు 6:** పట్టణంలోని పలుప్రాంతాల్లో అపరిశుభ్రతపై అధికారులు కదిలారు. మంగళవారం పట్టణంలోని మదీనా మసీదు వీధిలో మాంసవ్యర్థాలతో అపరిశుభ్రంగా మారిన ప్రాంతాన్ని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని మాంసం విక్రయదారులను హెచ్చరించారు. అనంతరం కూడలిలోని చెత్త కుప్పలను పంచాయతీ సిబ్బంది తొలగించి, శుభ్రం చేయించారు. సర్పంచ్ సరోజనాగేనాయక్ ఆధ్వర్యంలో ఆయాప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. వైద్యసిబ్బంది ద్వారా బుధవారం నుంచి పైప్రాంతాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఇఓఆర్‌డీ సుధాకర్, కార్యదర్శి బాబురావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మాంసం దుకాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

# 9, 10 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ప్లీనరీ

**హిందూపురం అర్బన్, ఆగస్టు:** ఎస్ఎఫ్ఐ 6వ ప్లీనరీన కొత్తచెరువులో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి ప్లీనరీ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో అనేక సమస్యలు ఉన్నాయనీ, కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. 117, 77 జీఓలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, జస్వంత్, పవన్, సుభాష్, రంగా, పకృద్దీన్, గురు, జయచంద్ర, మహేష్, హుస్సేన్, ప్రదీప్, నిహాల్ తదితరులు పాల్గొన్నారు.




కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

**మడకశిర టౌన్, ఆగస్టు 6:** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిపై మెప్మా సంఘాల రీసోర్స్ పర్సన్‌లు మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో మడకశిర నగర పంచాయతీ పరిధిలో ఒక్కొక్క రీసోర్స్ పర్సన్ నుంచి వద్ద రూ.50 వేలు, రూ.లక్ష ప్రకారం వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన తరువాతనే తమను రీసోర్స్‌పర్సన్‌లుగా కొనసాగించారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి నుంచి తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని పోలీసులను కోరారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మెప్మా ఆర్పీలు

# తల్లిపాలు బిడ్డకు అమృతం: డీఎంహెచ్ఓ

**మడకశిర రూరల్, ఆగస్టు 6:** తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను మంగళవారం మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేయస్కరం అన్నారు. తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిగా బిడ్డకు పనిచేస్తుందన్నారు. అనంతం డీఎంహెచ్ఓ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్, సూపర్ వైజర్ రాంప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు,ఆశవర్కర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భవతులు పాల్గొన్నారు.

**హిందూపురం అర్బన్ :** తల్లిపాలతోనే బిడ్డకు శ్రేయస్కారమని సీడీపీఓ రెడ్డిరమణమ్మ, పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని మోడల్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె.. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో 11, 12 వార్డు కౌన్సిలర్‌లు అంజలి, మహబూబ్‌బీ, సూపర్‌వైజర్లు శాంతి, అనిత, జయమ్మ, పాఠశాల హెచ్‌ఎం హబీబ్ తస్లీం, ఏఎన్‌ఎం త్రివేణి, ఎర్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

# విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

**లేపాక్షి, ఆగస్టు 6:** పందుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ గోపీ తెలిపిన వివరాల మేరకు కొండూరు సబ్‌స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో వేటగాళ్లు.. పందుల కోసం విద్యుత్ తీగలను ఏర్పాటుచేశారు. కొండూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు(38) సోమవారం రాత్రి పని నిమిత్తం గలిబిపల్లికి వెళ్లి కాలినడకన తిరిగి వస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్థులు ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులుకు భార్య సుభాషిణి, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



శ్రీనివాసులు మృతదేహం

# లారీని ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

**పెనుకొండ రూరల్, ఆగస్టు 6:** మండలంలోని హరిపురం వైజంక్షన్‌వద్ద 44వ జాతీయ రహదారిపై లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రేకులకుంట గ్రామానికి చెందిన పవన్, భార్య, పెనుకొండకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నారు. హరిపురం వైజంక్షన్ వద్దకు రాగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ స్పీడ్ బ్రేకర్లవద్ద సడన్ బ్రేక్ వేశారు. దీంతో వెనకాల వస్తున్న ఆటో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పవన్, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

# నన్ను అడగకుండా.. నాపేరు ప్రచురించారు..

**గోరంట్ల, ఆగస్టు 6:** తనను అడగకుండా తన పేరు ప్రచురించారని జగన్ పత్రికపై జాతీయ పర్యావరణ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రెడ్డివారి శంకర్‌నారాయణ మంగళవారం ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 53 రోజులైనా ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు అందలేదని తన ఫొటోతో ప్రచురించిన కథనంలో వాస్తవం లేదన్నారు. నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, జగన్ పత్రిక ప్రచురించింది అవాస్తవాలన్నారు. తనకు తెలియకుండా తన ఫొటో ప్రచురించారనీ, మరోసారి జరిగితే చట్టపరమైన చర్యలు చేపడతానని హెచ్చరించారు.

# పాఠశాల పరిశీలన

**పెనుకొండ, ఆగస్టు 6:** పట్టణంలోని జ్యోతిరావుపూలే పాఠశాలలో చేపట్టాల్సిన మరమ్మతు పనులను పంచాయతీరాజ్ అధికారులు, టీడీపీ నాయకులు పరిశీలించారు. ఇటీవల బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టిన సమయంలో విద్యార్థులు సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఎస్ఈ మురళిమోహన్, డీఈ వెంకటరాముడు, తెలుగుదేశం పట్టణ కన్వీనర్ శ్రీరాములు, సీనియర్ నాయకులు మాధవనాయుడు, మంత్రి పీఏ శ్రీనివాసులు, రామాంజినేయులు, పాఠశాల భవనాన్ని పరిశీలించారు. మరమ్మతు పనుల గురించి చర్చించారు. వీరివెంట పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు

**గోరంట్ల, ఆగస్టు 6:** మండలంలోని తాటిమేకల పల్లిలో ఇంటి ముందు చెత్త విషయంలో టీడీపీ, వైసీపీకి చెందిన రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. టీడీపీకి చెందిన రామ్మోహన్ నాయుడు ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన ఓబులమ్మ, ఆదినారాయణ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, పవన్‌కుమార్‌లపై కేసు నమోదుచేశారు. ఈదాడిలో రామ్మోహన్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, ఓబులమ్మ గాయపడిన విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన ఓబుళమ్మ ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌నాయుడు, ప్రతాప్‌నాయకుడు, శ్రీనివాసులు నాయుడుపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

# డ్రిప్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి

**మడకశిర రూరల్, ఆగస్టు 6:** ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్ సౌకర్యాని సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఐఎంపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నరసింహప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు ఆయా పంచాయితీ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం వన్ బీ, ఎఫ్ఎంబి స్కెచ్, చెక్కుబంది సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం,బోరుకు సంబంధించిన విద్యుత్ బిల్లు తదితర జిరాక్స్ దరఖాస్తు చేసుకుంటే డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రేపు యల్లమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం

**హిందూపురం అర్బన్, ఆగస్టు 6:** పట్టణ పరిధిలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన యల్లమ్మ దేవి ఆలయంలో 8వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిచనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గణపతి పూజ, హోమాలు, శుక్రవారం ఉదయం 6 గంటలకు కలశస్థాపన అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకార సేవ, 9 గంటలకు గణపతి, యల్లమ్మ, శాంతి హోమాలు, మూలమంత్రం, పుష్పార్చన, మంగళహారతి ఉంటాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# బాలల హక్కులపై అవగాహన సదస్సు

**పెనుకొండ, ఆగస్టు 6:** స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శాంతలక్ష్మీ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళశారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీటి మహిళా విభాగం టీమ్‌లీడర్ ఆదినారాయణ హాజరై ప్రసంగించారు. బాల్యవివాహాల చట్టం, బాలల న్యాయ చట్టం, ఫోక్సోచట్టం, పిల్లలపై లైంగిక వేధింపులు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సుజాత, అనురాధ, పుష్ప, యర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ

**మడకశిర(అమరాపురం), ఆగస్టు 6:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలనీ, మెనూ తప్పక పాటించాలని ఆయన ఆదేశించారు.